

సైనిక అధికారికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

వైభవంగా సుదర్శన నారసింహహోమం

యాదగిరిగుట్ట, మే1: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో బుధవారం సుదర్శన నారసింహహోమం వైభవంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రంవేళలో స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. రాత్రి స్వామివారి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్ర నామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 32, 27,683 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో సైనిక అధికారులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని వైస్ ఆడ్మిరల్, ఫ్లాట్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్, ఈస్టన్ నావల్ కమాండ్ రాజేశ్ పెండర్కర్, రేర్ ఆడ్మిరల్, స్టేషన్ కమాండర్ రవ్‌నిష్ సేత్ దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చక బృందం వారికి స్వాగతం పలికి, స్వామివారి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి రేగు సిద్దులు

నేడు బీఆర్ఎస్ క్లస్టర్ సమావేశాలు

రాజాపేట, మే 1 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేషం గురువారం నిర్వహించే పార్టీ క్లస్టర్ సమావేశాల్లో పాల్గొననున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి, కార్యదర్శి రేగు సిద్దులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు రాజాపేట క్లస్టర్, సాయంత్రం 4 గంటలకు పాముకుంట , 5 గంటలకు బొందుగుల, 6 గంటలకు రఘునాథపురం కస్టర్ సమావేశాలు నిర్వహించేనున్నట్లు పేర్కొన్నారు. సమావేశాలకు ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో మహిళా విభాగం మండలాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, నాయకులు సట్టు తిరుమలేశ్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భూదాన్‌పోచంపల్లి, మే1 : మండలంలోని వంకమామిడి గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో 2008-2009 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, సత్తయ్య, వెంకటేశ్వర్లు, చారి, సత్యం, పూర్వ విద్యార్థులు బొడిగే శివ, కాసుల చందు, ప్రియాంక, మమత, సతీశ్, శంకర్, పరమేశ్వరి, శిరీష, మహేశ్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినికి అభినందనలు

టెన్త్‌లో అధిక గ్రేడ్ సాధించిన జ్యోతిని అభినందిస్తున్న వార్డెన్ రాజాలుబాయి

ఆత్మకూరు(ఎం), మే1 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థిని యాదవల్లి జ్యోతి పదో తరగతి ఫలితాల్లో 9 జీపీఏ సాధించింది. బుధవారం వసతి గృహం అధికారి రాజాలుబాయి విద్యార్థిని వాలువాతో సన్మానించి అభినందించారు. ఆమె వెంట విద్యార్థిని తల్లిదండ్రులు ఉన్నారు.

రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

రైస్‌మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

భువనగిరి కలెక్టరేట్ మే 1 : భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరిలో గల రైస్‌మిల్లులో బుధవారం సివిల్‌సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ధాన్యం దిగుమతులు, సీఎంఆర్ ధాన్యం సేకరణ వంటి అంశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, జిల్లా అధికారులు ఉన్నారు.

ఘనంగా మేడే వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాల జెండావిష్కరణ
- ర్యాలీలతో కదం తొక్కిన కార్మికలోకం

బీబీనగర్, మే 1 : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ కేవీ, సీపీ ఎంతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం కార్మికులతో ర్యాలీ చేపట్టారు.

కేటీఆర్‌కు బీఆర్‌టీయూ నాయకుల మేడే శుభాకాంక్షలు

చౌటుప్పల్‌రూరల్ : మేడే సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌టీయూ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి పాల్గొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాట కృష్ణ, ఆటోయూనియన్ జిల్లా నాయకులు జువ్వి శివకుమార్, యూనియన్ జిల్లా నాయకులు నాగరాజు, సాయి, పవన్ వెంకటేశ్, రమేశ్, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మేడే శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

కార్మికుల శ్రమకు తగిన వేతనం అందించాలి

భువనగిరి కలెక్టరేట్ : ప్రభుత్వం కార్మికుల కష్టాన్ని గుర్తించి శ్రమకు తగిన వేతనాన్ని అందించాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు సిలువేరు మధు డిమాండ్ చేశారు. మేడేను పురస్కరించుకుని బుధవారం మండలంలో నరి పెంచికల్‌పహాడ్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి సంబురాలు జరుపుకొన్నారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, మహేశ్, రవి, సుభాశ్, పోషయ్య, కార్మికులు పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో బీఆర్ఎస్‌కేవీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం మండలాధ్యక్షుడు రషీద్



భువనగిరి కలెక్టరేట్ : మేడే ఉత్సవాల్లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు సిలువేరు మధు

చౌటుప్పల్ మున్సిపాలిటీలో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

భూదాన్‌పోచంపల్లిలో మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నేడు తుర్కపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

తుర్కపల్లి, మే1 : మండల కేంద్రంలో గురువారం నిర్వహించే బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం హాజరు కానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మండలంలోని 10 ఎంపీటీసీల పరిధిలో నాలుగు సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి : ఏఓ

ఆలేరురూరల్, మే1 : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఏఓ దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని గొలనుకొండ, కొలనుపాకలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు రసీదు తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యేవరకు రసీదు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ వలిగొండ పట్టణ అధ్యక్షుడిగా అఫ్రోజ్

వలిగొండ, మే1: బీఆర్ఎస్ వలిగొండ పట్టణ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు మహ్మద్ అఫ్రోజ్‌ను నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అఫ్రోజ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తుర్కపల్లి మండల సర్వసభ్య సమావేశం

తుర్కపల్లి, మే1 : మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆయిల్‌పామ్ మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- ఆయిల్‌ఫెడ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారులు

చౌటుప్పల్ రూరల్, మే1 : ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులు మొక్కల సంరక్షణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆయిల్‌ఫెడ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చిన్నకొండూరు గ్రామంలో ఆయిల్‌పాం తోటలు సాగు చేసిన రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతుండడంతో మొక్కలకు మైక్రోజెట్స్ ద్వారా నీరందించాలని సూచించారు. రెండు వరుసలలో జనుము, పచ్చి రొట్టె విత్తనాలను చల్లుకోవాలని, మొక్కకు 12 నుంచి 30 నెలల వరకు పుష్పాలను తొలగించాలన్నారు. అనంతరం రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి కవిత, ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్‌కుమార్, ఎంఓ గణేశ్, రైతులు పాల్గొన్నారు.

గ్రేడ్, నాణ్యత పాటించాలనడంతోనే రైతుల ధర్నా

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి అనూరాధ

యాదాద్రి భువనగిరి, మే 1 (నమస్తే తెలంగాణ) : గ్రేడ్, నాణ్యతా ప్రమాణాలు పాటించని ధాన్యాన్ని శుభ్రపరచాలని కోరినందుకు, వలిగొండ మండలంలోని సంగెం, వర్కట్‌పల్లి రైతులు ధర్నా చేశారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి అనూరాధ తెలిపారు. ధాన్యం నాణ్యత లేకపోవడంతో మిల్ పాయింట్ వద్ద ఆపినట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం వలిగొండ మండలంలోని సంగెం, వర్కట్‌పల్లి రైతుల ధర్నా నేపథ్యంలో బుధవారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఏప్రిల్ ఐదో తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయని, ఇప్పటి వరకు 69 మంది రైతుల నుంచి 12,360 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. సంగెం గ్రామం మూసీ పరీవాహక ప్రాంతం కావడంతో అక్కడి ధాన్యంలో తాలు శాతం ఎక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గ్రేడ్-బీ రకం ధాన్యాన్ని రైతులు సాగు చేశారని, ధాన్యాన్ని తూర్పార పట్టకుండా తేవడంతో మిల్ పాయింట్‌కు వెళ్లేసరికి తరుగు కూడా వస్తుందని వివరించారు. రైతులు ధాన్యాన్ని శుభ్రపరిచిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించినట్లు వెల్లడించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ధాన్యం అనాలసిస్ చేసేటప్పుడు గ్రేడ్-ఏ, బీ అని నిరూపణ కోసం కుప్ప క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించామన్నారు. గ్రేడ్, నాణ్యత ప్రమాణాలు పాటించని ధాన్యాన్ని శుభ్రపరచాలని కోరడంతో రైతులు విముఖంగా ఉండి ధర్నా చేశారని ఆమె తెలిపారు. మిల్ పాయింట్ వద్ద హమాలీల సంఖ్య పెంచాలని జిల్లా మిల్లర్లను కోరినట్లు చెప్పారు. లారీ కాంట్రాక్టర్లకు కూడా తగినన్నీ లారీలు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆదేశాలను అనుసరించి మిల్లర్లు కూడా సహకరించి ధాన్యాన్ని దిగుమతి చేసుకున్నారని ఆమె వెల్లడించారు.

పోచంపల్లి బ్యాంక్ విస్తరణకు ఆర్‌బీఐ అనుమతి

భూదాన్‌పోచంపల్లి, మే 1 : పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు సంబంధించి కొత్తగా 5 బ్రాంచ్‌లను ప్రారంభించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి ఇచ్చిందని బ్యాంక్ చైర్మన్ కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, సీఈఓ సీత శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండమల్లేపల్లి, ఇబ్రహీంపట్నం, ఆమనగల్, కల్వకుర్తి, తుర్కయంజాల్‌లో కొత్తగా బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ రూ.325 కోట్ల వ్యాపారం చేసి, రూ. 2.57 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు తెలిపారు. బ్యాంక్ ఐదు కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతివ్వడంపై బ్యాంక్ వ్యవస్థాపకులు, పాలకవర్గ సభ్యులు, వాటాదారులు, ఖాతాదారులు, వివిధ శాఖల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

చౌటుప్పల్‌రూరల్, మే1 : చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద జాతీయ రహదారి 65పై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘటకేసారం మండలం పోచారం గ్రామానికి చెందిన చందన్‌కుమార్(24), సూర్యాపేట జిల్లా హూజూర్‌నగర్‌కు చెందిన రాజేశ్(28) పల్సర్‌బైక్‌పై విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దాంతో బైక్ నడుపుతున్న చందన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రాజేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చందన్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి

బొమ్మలరామారం, మే1 : బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సత్యనారాయణ భార్య రజని ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం కార్యకర్త కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, గులపల్లి వెంకటేశ్ గౌడ్, పెద్దిరెడ్డి మల్లారెడ్డి, మానుక రాజుయాదవ్, మూగల మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు

- కలెక్టర్ హనుమంత్ కె. జండగే

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంత్ కె. జండగే

భువనగిరి కలెక్టరేట్, మే 1 : ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంత్ కె. జండగే తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు స్లిప్పులు, ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన చర్యలు, హోమ్ ఓటింగ్, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద చేపడుతున్న భద్రతా చర్యలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలతో పాటు, డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్ల వద్ద ఏర్పాట్లు, సువిధ ద్వారా అనుమతుల జారీ, సీ-విజిల్ లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం వంటి విషయాలపై సమీక్షించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ వివరించారు. 39 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓటరు జాబితా అందజేయడంతో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించినట్లు చెప్పారు. ఎన్నికల ఖర్చు నమోదు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వివరించామన్నారు, ఓటరు స్లిప్పుల పంపిణీ జరుగుతున్నదని తెలిపారు. కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు గడువు లోపు పంపిణీ చేస్తామన్నారు. 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగ ఓటర్లు ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలకు రెండో విడుత శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలిస్తూ వెంటనే అనుమతులు జారీ చేస్తున్నామని, సీ-విజిల్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదుల పట్ల చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. బెన్ షాలోమ్, అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు

సర్వేల్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

సంస్థాన్‌నారాయణపురం, మే1 : మండలంలోని సర్వేల్ గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొంతమంది నాయకులు తమ స్వార్థం కోసం పార్టీను వీడినా నష్టమేమీ లేదని, ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు తామంతా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాధవరెడ్డి సేవలు చిరస్మరణీయం

- జడ్పీటీసీ సభ్యుడు బీరుమల్లయ్య

మాధవరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మే1 : మాజీ హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి ఉమ్మడి జిల్లాకు చేసిన సేవలు చిరస్మరణీయమని జడ్పీటీసీ సభ్యుడు సుబ్బారు బీరుమల్లయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి అన్నారు. బుధవారం మాధవరెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని వడపర్తిలో మాధవరెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాధవరెడ్డిరెడ్డి హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మాధవరెడ్డి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట నర్సింహ, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్‌లక్ష్మీనారాయణగౌడ్, బీఎన్‌తిమ్మాపూర్ ఎంపీటీసీ ఉడుత శారదాఆంజనేయులు, యాదవ సంగం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశ్‌యాదవ్, చందుపట్ల మాజీ సర్పంచ్ చిన్నం పాండు, సత్తిరెడ్డి, వల్లందాస్ పరమేశ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో పోలీస్ కవాతు

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మే 1 : ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సీఐ రాములు, స్థానిక ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఏఎస్ఐలు సైదిరెడ్డి, శంకర్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్, సీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.